టాప్ లేపారు

బాక్సింగ్ డే టెస్టులో ఆసీస్ టాపార్డర్ జోరు • నలుగురు బ్యాటర్ల అర్ధ సెంచరీలు

కాన్‌స్టాస్ మెరుపులు • తొలి రోజు ఆసీస్ 311/6 • చివర్లో పుంజుకున్న భారత్

బాక్సింగ్ డే టెస్టు పేరుకు తగ్గట్టే తొలి రోజు బ్యాటర్ల దూకుడుతో ప్రారంభమైంది. ఆతిథ్య ఆస్ట్రేలియా తరఫున అరంగేట్ర కుర్రాడు సామ్ కాన్‌స్టాస్ నాటు కొట్టుడుకు తోడు సీనియర్ బ్యాటర్లు ఖవాజా, లబూషేన్, స్మిత్ నిలకడైన ఆటతీరుతో మొదటి రోజు ఆటలో కంగారూలు పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. ఆడుతున్నది తొలి టెస్టు అయినా భయమన్నదే లేకుండా క్రీజులో మెరుపులు మెరిపించిన కాన్‌స్టాస్.. ఆసీస్‌కు అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. ఈ సిరీస్‌లో కంగారూలను ముప్పు తిప్పలు పెడుతున్న బుమ్రాతో పాటు ఇతర బౌలర్లపై పిడుగులా విరుచుకుపడ్డాడు. కాన్‌స్టాస్ నిష్క్రమించినా మిగిలిన బ్యాటర్లు జోరు కొనసాగించారు. కంగారూల బ్యాటింగ్‌కు తేలిపోయి రెండు సెషన్ల పాటు వికెట్ల వేటలో వెనుకబడ్డ భారత బౌలర్లు చివరి సెషన్‌లో కీలకమైన నాలుగు వికెట్లు పడగొట్టడం విశేషం.

కాన్‌స్టాస్ (60)

లబూషేన్ (72)

మెల్‌బోర్న్: ప్రతిష్టాత్మక మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ) వేదికగా సుమారు 87వేల మంది ప్రేక్షకులు హాజరైన భారత్, ఆస్ట్రేలియా బాక్సింగ్ డే టెస్టులో తొలి రోజు ఆతిథ్య జట్టు బ్యాటింగ్‌లో అదరగొట్టింది. ఎంసీజీలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్‌కు వరుసగా నలుగురు టాపార్డర్ బ్యాటర్లు అర్ధసెంచరీలతో మెరవడంతో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు 86 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 311 పరుగులు చేసింది. అరంగేట్ర మ్యాచ్‌లోనే యువ ఓపెనర్ సామ్ కాన్‌స్టాస్ (65 బంతుల్లో 60, 6 ఫోర్లు, 2 సిక్సర్లు) టీ20 తరహా ఆటకు తోడు సీనియర్లు మార్నస్ లబూషేన్ (145 బంతుల్లో 72, 7 ఫోర్లు), స్టీవ్ స్మిత్ (111 బంతుల్లో 68 నాటౌట్, 5 ఫోర్లు, 1 సిక్స్), ఉస్మాన్ ఖవాజా (121 బంతుల్లో 57, 6 ఫోర్లు) అర్ధసెంచరీలతో కదం తొక్కారు. తొలి రెండు సెషన్లూ కంగారూల ఆధిపత్యం కొనసాగిన మ్యాచ్‌లో ఆఖరి సెషన్‌లో టీమ్‌ఇండియా పుంజుకుంది. బుమ్రా (3/75)తో పాటు ఇతర బౌలర్లు రాణించడంతో రోహిత్ సేన ఊపిరి పీల్చుకుంది.

సీనియర్ల నిలకడ

కాన్‌స్టాస్ మెరుపులు ముగిసిన తర్వాత మెల్‌బోర్న్‌లో ఆసీస్ సీనియర్ల షో మొదలైంది. లంచ్ అనంతరం ఖవాజా, లబూషేన్ భారత బౌలర్లను విసిగించారు. ఈ ఇద్దరూ డిఫెన్స్‌కే ప్రాధాన్యమిస్తూ వీలుచిక్కినప్పుడల్లా పరుగులు రాబట్టారు. 101 బంతుల్లో ఖవాజా ఫిఫ్టీ పూర్తయింది. ఈ సిరీస్‌లో అతడికి ఇదే తొలి అర్ధ సెంచరీ. రెండో వికెట్‌కు 150 బంతుల్లో 65 పరుగులు జోడించిన ఈ జోడీని డ్రింక్స్ తర్వాత ఎట్టకేలకు బుమ్రా విడదీశాడు. ఈ సిరీస్‌లో బుమ్రా బౌలింగ్‌లో ఔటవడం ఖవాజాకు ఇది ఐదోసారి. ఖవాజా స్థానంలో వచ్చిన స్మిత్ కూడా తనకు ఎంతో ఇష్టమైన ఎంసీజీలో ఆకట్టుకున్నాడు. ఈ ఇద్దరినీ ఔట్ చేయడానికి రోహిత్.. బౌలర్లను మార్చి మార్చి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. 114 బంతుల్లో లబూషేన్ హాఫ్ సెంచరీ పూర్తయింది.

చివరి పంచ్ మనదే

ప్రమాదకరంగా మారుతున్న లబూషేన్-స్మిత్ జోడీని రెండో సెషన్ డ్రింక్స్ విరామం తర్వాత వాషింగ్టన్ సుందర్ విడదీశాడు. అతడు వేసిన తొలి బంతిని మిడాఫ్ దిశగా ఆడబోయిన లబూషేన్.. కోహ్లీకి దొరికిపోయాడు. అతడి స్థానంలో క్రీజులోకి వచ్చిన ప్రమాదకర ట్రావిస్ హెడ్ (0) డకౌట్ అయ్యాడు. బుమ్రా వేసిన బంతిని తప్పుగా అంచనా వేసిన హెడ్.. మూల్యం చెల్లించుకోక తప్పలేదు. తన తర్వాతి ఓవర్లో బుమ్రా.. మిచెల్ మార్ష్ (4)నూ పెవిలియన్‌కు పంపాడు. అలెక్సీ కేరీ (31)ని ఆకాశ్ దీప్ అద్భుతమైన లెంగ్త్ డెలివరీతో బోల్తా కొట్టించాడు. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి స్మిత్, సారథి పాట్ కమిన్స్ (8 నాటౌట్) క్రీజులో ఉన్నారు. రెండో రోజు ఆసీస్‌ను వీలైనంత త్వరగా ఆలౌట్ చేసి ఆ జట్టుకు దీటుగా బ్యాటింగ్ చేయడం భారత్ ముందున్న కర్తవ్యం.

కుర్రాడి నాటు కొట్టుడు

కొంతకాలంగా ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మెరుపులు మెరిపిస్తూ జాతీయ జట్టు నుంచి పిలుపు అందుకున్న యువ ఓపెనర్ కాన్‌స్టాస్.. తన తొలి మ్యాచ్‌లోనే అంచనాలకు మించి రాణించాడు. 19 ఏండ్ల 85 రోజులకే అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ఈ కుర్రాడు.. ప్రమాదకర బుమ్రాతో పాటు భారత బౌలర్లనూ ఆటాడుకున్నాడు. ఆడుతున్నది తొలి మ్యాచే అయినా ఏమాత్రం బెరుకు లేకుండా ఆది నుంచే దంచుడు మంత్రాన్ని పఠించాడు. ఎదుర్కొన్న మొదటి 21 బంతుల్లో అతడు 5 పరుగులే చేశాడు. కానీ అది తుఫాను ముందు ప్రశాంతతే. బుమ్రా వేసిన ఇన్నింగ్స్ ఏడో ఓవర్ నుంచి మొదలైంది కాన్‌స్టాస్ కొట్టుడు. ఆ ఓవర్ తొలి బంతిని బౌండరీకి తరలించిన అతడు రెండో బంతిని సిక్సర్‌గా మలిచాడు. ఈ రెండూ రివర్స్ స్కూప్ షాట్లే. 2021 తర్వాత టెస్టులలో బుమ్రా బౌలింగ్‌లో సిక్సర్ కొట్టిన తొలి క్రికెటర్ కాన్‌స్టాసే. ఈ ఓవర్లో 14 పరుగులు పిండుకున్న అతడు.. బుమ్రానే వేసిన 11వ ఓవర్లో 4, 6, 4, 2తో ఏకంగా 18 పరుగులు రాబట్టాడు. కాన్‌స్టాస్ దూకుడుతో ఆసీస్ స్కోరు వేగం పుంజుకుంది. 52 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్న అతడు.. జడేజా 20వ ఓవర్లో రెండో బంతికి వికెట్ల ముందు దొరికిపోవడంతో 89 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.

కోహ్లీకి జరిమానా

భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి ఐసీసీ షాకిచ్చింది. మెల్‌బోర్న్ టెస్టు తొలిరోజు ఆటలో భాగంగా కోహ్లీ.. ఆసీస్ ఓపెనర్ కాన్‌స్టస్‌ను కవ్వించడంతో పాటు వాగ్వాదానికి దిగినందుకు గాను ఐసీసీ తక్షణ చర్యలకు ఉపక్రమించింది. ఐసీసీ నియమావళిలోని ఆర్టికల్ 2.12ను అతడు ఉల్లంఘించాడని మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ తెలిపాడు. బుమ్రా వేసిన 11వ ఓవర్లో కోహ్లీ.. నాన్ స్ట్రయికర్ ఎండ్ నుంచి వస్తున్న కాన్‌స్టాస్ భుజాన్ని తోసుకుంటూ వెళ్లిపోయాడు. ఇదే సమయంలో కాన్‌స్టాస్ ఏదో అనడంతో దానికి కోహ్లీ కూడా దీటుగా స్పందించాడు. దీంతో ఇరువురి మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. కోహ్లీపై ఒక మ్యాచ్ నిషేధం విధించాలని డిమాండ్లు వచ్చినా అతడు తప్పు ఒప్పుకోవడంతో మ్యాచ్ ఫీజులో 20 శాతం కోత, ఒక డీమెరిట్ పాయింట్ విధిస్తూ ఐసీసీ నిర్ణయం తీసుకుంది.

బుమ్రా (3/75)

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా: 86 ఓవర్లలో 311/6 (లబూషేన్ 72, స్మిత్ 68, బుమ్రా 3/75, వాషింగ్టన్ 1/37)

తెలంగాణ స్టేట్ సెయిలింగ్ చాంపియన్‌షిప్ షురూ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ స్టేట్ సెయిలింగ్ చాంపియన్‌షిప్ ఎనిమిదో ఎడిషన్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. నగరంలోని హుస్సేన్ సాగర్ వేదికగా జరుగుతున్న ఈ పోటీలలో రాష్ట్రంలోని 15 జిల్లాల నుంచి 131 మంది క్రీడాకారులు ఆరు విభాగాల్లో పోటీపడనున్నారు. తొలి రోజు ప్రతికూల వాతావరణంలోనూ సాగర్ జలాల్లో సెయిలర్లు రంగురంగుల బోట్లలో ట్రెయినింగ్, ప్రాక్టీస్‌తో సందడి చేశారు. దేశంలోనే అతిపెద్ద చాంపియన్‌షిప్‌లలో ఒకటైన ఈ టోర్నీలో తెలంగాణ గడిచిన పదేండ్లలో 60 మందికి పైగా జాతీయ చాంపియన్లు, 275 పతకాలతో ముందంజలో ఉంది. ఈ సందర్భంగా తెలంగాణ సెయిలింగ్ సంఘం అధ్యక్షుడు సుహేమ్ షేక్ మాట్లాడుతూ.. 'ఈ సారి 29ఈఆర్ స్కిఫ్, 420 డబుల్ హ్యాండర్స్ విభాగాలను జోడించడంతో అన్ని కేటగిరీల్లో రికార్డు ఎంట్రీలు నమోదయ్యాయి. తెలంగాణలో ప్రతిభావంతులను గుర్తించి తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నాం. చైనాలో జరిగే 2026 ఆసియా క్రీడలు, లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌పై దృష్టి సారించాం' అని అన్నారు.

సెమీఫైనల్లో యూపీ, పాట్నా

పూణె: ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) తాజా ఎడిషన్‌లో యూపీ యోధాస్, పాట్నా పైరేట్స్ సెమీస్‌కు అర్హత సాధించాయి. బుధవారం పూణెలోని శ్రీ శివ్ ఛత్రపతి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన తొలి ఎలిమినేటర్‌లో యూపీ.. 46-18తో జైపూర్ పింక్ పాంథర్స్‌పై జయభేరి మోగించింది. యూపీ తరఫున రైడర్ భవానీ రాజ్‌పుత్ ఏకంగా 12 పాయింట్లతో మెరిశాడు. రెండో ఎలిమినేటర్‌లో పాట్నా.. 31-23తో యూ ముంబాపై గెలిచింది. పాట్నా నుంచి అయన్ 10 పాయింట్లు సాధించగా దేవాంక్ 6 పాయింట్లతో రాణించాడు. గురువారం జరుగబోయే తొలి సెమీస్‌లో యూపీ.. హర్యానా స్టీలర్స్‌తో అమీతుమీ తేల్చుకోనుండగా రెండో సెమీస్‌లో దబాంగ్ ఢిల్లీ.. పాట్నా పైరేట్స్‌ను ఢీకొననుంది.

సెమీస్‌కు బెంగాల్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్టాత్మక ఫుట్‌బాల్ టోర్నీ సంతోష్ ట్రోఫీలో పశ్చిమ బెంగాల్ జట్టు సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది. బుధవారం హైదరాబాద్‌లోని డెక్కన్ ఏరీనా వేదికగా జరిగిన మ్యాచ్‌లో బెంగాల్.. 3-1తో ఒడిషాను ఓడించింది. ఈ టోర్నీలో బెంగాల్ సెమీస్‌కు చేరడం ఇది 52వ సారి కావడం విశేషం. ఒడిషా తరఫున రాకేశ్ ఓరమ్ 25వ నిమిషంలో తొలి గోల్ చేసి ఆ జట్టును ఆధిక్యంలోకి తీసుకొచ్చినా ఆ తర్వాత బెంగాల్ పుంజుకుంది. రాబొ హన్స్‌డ రెండు గోల్స్ చేయగా సబ్‌స్టిట్యూట్ మనొటొస్ మాఝి ఒక గోల్ చేశాడు.

పాక్ 211 ఆలౌట్

సెంచూరియన్: స్వదేశంలో పాకిస్థాన్‌తో ఆడుతున్న తొలి టెస్టు మొదటి రోజే మ్యాచ్‌పై దక్షిణాఫ్రికా పట్టు సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ప్రత్యర్థికి బ్యాటింగ్ అప్పగించిన సఫారీలు.. తొలి ఇన్నింగ్స్‌లో పాక్‌ను 211 పరుగులకే కుప్పకూల్చారు. డేన్ పీటర్సన్ (5/61) ఐదు వికెట్లతో చెలరేగగా కార్బిన్ బోష్ (4/63) పాక్ బ్యాటర్ల ఆట కట్టించారు. కమ్రాన్ గులామ్ (54) టాప్ స్కోరర్. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన సౌతాఫ్రికా మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 22 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 82 పరుగులు చేసింది.

కాంగ్రెస్ పాలనలో రియల్ ధమాల్

'హైదరాబాద్‌లో రియల్‌ఎస్టేట్ రంగం పడిపోలేదు. చంద్రబాబు రాగానే ఏపీకి పెట్టుబడులు పోతున్నాయంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవం. హైదరాబాద్-బెంగళూరు కేంద్రంగానే పెట్టుబడులు వస్తున్నాయి. అమరావతికి తరుచుగా వచ్చే వరదలతో పెట్టుబడిదారులు జంకుతున్నారు' ఇవీ ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు. కానీ, వాస్తవిక పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నట్టు పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి.

- కుప్పకూలిన మార్కెట్‌కు ఎన్నో ఆధారాలు
- హైడ్రా భయం, ప్రభుత్వ విధానాలతో పెట్టుబడిదారుల్లో భయాందోళనలు
- దిద్దుబాటు చర్యలను మరిచిన ప్రభుత్వం
- తాజా సర్వేల్లో ఆందోళనకర అంశాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 26(నమస్తే తెలంగాణ): 'ఏడాది కాలంగా రియల్‌ఎస్టేట్ అమ్మకాలు లేవు... ఉన్న ప్రాజెక్టులకు పెట్టుబడులు రావు... హైడ్రా కారణంగా సామాన్యుడికి సొంతింటి కల భయానకంగా మారింది...' ఇవేవో ఒకరిద్దరూ చెప్తున్న మాటలు కాదు. తాజాగా వెల్లడవుతున్న రియల్‌ఎస్టేట్ రంగం అధ్యయనాలు, క్షేత్రస్థాయి రియల్‌ఎస్టేట్ ఏజెంట్లు, స్మాల్ అండ్ మీడియం డెవలపర్లు చెప్తున్న మాటలు. పెట్టిన పెట్టుబడికి మిత్తి కట్టలేని పరిస్థితులు దాపురించాయంటూ సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న నిజాలు. హైడ్రాతో హైదరాబాద్‌కు పెట్టుబడులు రావడం లేదంటూ కాంగ్రెస్ మిత్రపక్షమైన ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అసెంబ్లీ వేదికగా చేసిన వ్యాఖ్యలు వాస్తవిక పరిస్థితికి అద్దంపడుతున్నాయి. హైడ్రా.. రియల్‌ఎస్టేట్ వ్యాపారులతో పాటు సామాన్యులను కూడా కంటి మీద కునుకు లేకుండా చేసిందని, ఏడాది కాలంగా అవసరానికి ఒక్క ప్లాటు కూడా అమ్ముకోలేని పరిస్థితులు దాపురించాయని మాజీ మంత్రి మల్లారెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్‌కు రియల్‌ఎస్టేట్, ఐటీ రంగాల్లో పెట్టుబడుల ప్రవాహం కొనసాగితే, గత ఏడాది కాలంగా పరిస్థితి తల్లకిందులైందని, రెసిడెన్షియల్ సెగ్మెంట్‌లో అమ్మకాలు పడిపోయాయని వివిధ నివేదికలు ఘోషిస్తున్నాయి. రాష్ట్ర ఖజానాకు అత్యంత కీలకమైన హైదరాబాద్ రియల్‌ఎస్టేట్ రంగాన్ని పరిరక్షించుకునే దిద్దుబాటు చర్యలు చేపట్టకుండా, భయాందోళనలకు దారి తీసే విధానాలను ప్రభుత్వం కొనసాగిస్తే మార్కెట్ మరింత పడిపోతుందని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

సర్వేలతో బట్టబయలు

హైదరాబాద్‌లో రియల్‌ఎస్టేట్ మార్కెట్ డీలా పడిన తీరును వివిధ అధ్యయనాలు, సర్వేలు కండ్లకు కడుతున్నాయి. దేశంలోని ఏడు ప్రధాన మెట్రో నగరాల్లో రెసిడెన్షియల్ క్రయ, విక్రయాలపై తాజాగా విడుదలైన అనరాక్ వార్షిక నివేదిక ప్రకారం.. హైదరాబాద్‌లో గృహ విక్రయాలకు బ్రేక్ పడింది. గత సంవత్సరంతో పోల్చుకుంటే, ఈ ఏడాది గృహ విక్రయాలు 5% మేర పడిపోయినట్టు అనరాక్ నివేదిక పేర్కొన్నది. ఈ ఏడాది కాలంగా హైదరాబాద్‌లో 58,540 యూనిట్లు మాత్రమే అమ్ముడైనట్టు వెల్లడించింది. కొత్త ప్రాజెక్టులు కూడా మార్కెట్లోకి రావడం లేదని తెలిపింది. ఇదిలాఉంటే, బయ్యర్స్ డిలైట్ రియల్‌ఎస్టేట్ కన్సల్టెన్సీ వెల్లడించిన త్రైమాసిక నివేదిక ప్రకారం.. అక్టోబర్ నుంచి డిసెంబర్ నాటికి 47% అమ్మకాలు పడిపోయాయి. గత ఏడాది 24,044 యూనిట్లు విక్రయించగా, ఈసారి కేవలం 12,682 అమ్మకాలు జరిగినట్టు వివరించింది. అదే బెంగళూరులో 13% అమ్మకాలు మాత్రమే ప్రభావితమైనట్టు వెల్లడించింది. ఈ గణాంకాలన్నీ కాంగ్రెస్ పాలనలో రియల్‌ఎస్టేట్ రంగం ఎదుర్కొంటున్న దుస్థితిని కండ్లకు కడుతున్నాయి.

ప్రస్తుత పరిస్థితులపై రియల్టర్స్ అసోసియేషన్ ఆందోళన

కాంగ్రెస్ పాలనలో రియల్టీ మార్కెట్ కుప్పకూలిందని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ సభ్యులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా సాధారణ రియల్టర్లు, డెవలపర్లను లక్ష్యంగా చేసుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలుచేస్తున్న విధానాలు వ్యాపారానికి గొడ్డలిపెట్టుగా మారాయని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కేసీఆర్ పాలనలోనే రియల్‌ఎస్టేట్ మార్కెట్ అద్భుతంగా ఉండేదని గుర్తు చేసుకుంటున్నారు. పేదల నడ్డి విరిచే ఎల్ ఆర్ఎస్‌ను ఎత్తివేస్తే ఎంతోమంది పేద, మధ్య తరగతి వర్గాలకు లబ్ధి చేకూరుతుందని మంత్రి పొంగులేటికి ఎన్నోసార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదని చెప్తున్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్‌ను వణికిస్తున్న పులులు

- ఆసిఫాబాద్-మంచిర్యాల జిల్లాల సరిహద్దులో సంచారం
- 2-11కు పెరిగిన పులుల సంఖ్య
- పనులకెళ్లేందుకు ప్రజల్లో భయం
- అటవీశాఖ అధికారుల హెచ్చరికలు
- టైగర్ రిజర్వ్ కారిడార్‌పై గిరిజనుల వ్యతిరేకత

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తేతెలంగాణ) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను పులులు వణికిస్తున్నాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్-మంచిర్యాల జిల్లాల సరిహద్దుల్లో గతంలో ఉన్న రెండు పులులు కాస్తా.. 11కు పెరగడంతో ఇదిగో పులి.. అదిగో టైగర్ అన్న హెచ్చరికలతో స్థానికులు జంకుతున్నారు. పులుల భయంతో రోజువారీ పనులకు వెళ్లేందుకు అటవీ సమీప గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. తాజాగా ఎర్రగుంట గ్రామశివారులో అటవీ అధికారులు పులి కదలికలను గుర్తించారు. మంచిర్యాల జిల్లా ముల్కల్లబీట్ పరిధిలోనూ మరో ఆడపులి సంచారాన్ని కనిపెట్టారు. ఇక్కడే మరో ఆడపులి ట్రాప్‌కెమెరాకు చిక్కింది. ఇదే ఏరియాలో మరో మగపులి సంచరిస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు. మందమర్రి, అందుగులపేట, తాండూరు మండలం నీలాయిపల్లి సమీపంలో పులి సంచారం కలకలం రేపుతోంది. బొంబాయిగూడ గ్రామ శివారులోని ఉచ్చమల్లవాగుతో పాటు సమీప పంటచేలల్లో మేకలకాపరులు పులి పాదముద్రలను చూసినట్టు తెలిపారు. పులల సంచారంతో అలర్ట్ అయిన అటవీశాఖ అధికారులు గ్రామాల్లో చాటింపు వేయిస్తూ అప్రమత్తం చేస్తున్నారు. జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

టైగర్ కారిడార్ ఆలోచన విరమించుకోవాలి: ఎమ్మెల్యే హరీశ్‌బాబు, సిర్పూర్

ఓ వైపు జిల్లాను పులల భయం వెంటాడుతుంటే.. మరోవైపు కాగజ్‌నగర్ టైగర్ కారిడార్ ఏర్పాటుపై పంచాయితీ మొదలైంది. టైగర్ కారిడార్ ఏర్పాటు పేరుతో గిరిజనులకు పోడు భూములను దూరం చేసే కుట్ర జరుగుతున్నదని స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌బాబు పేర్కొన్నారు. కాగజ్‌నగర్‌ను టైగర్‌జోన్ ఏర్పాటుచేయాలన్న ఆలోచనను అటవీశాఖ విరమించుకోవాలని డిమాండ్‌చేశారు. ప్రజాభిప్రాయం లేకుండా టైగర్‌జోన్ ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. టైగర్ కారిడార్ పేరుతో స్థానిక గిరిజనులపై అటవీశాఖ అధికారులు ప్రత్యక్ష దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దాడులను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రోడ్డుపైకి పులి.. భయాందోళనలో ప్రజలు

కౌటాల, డిసెంబర్ 26 : కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టీ)-మహారాష్ట్ర అంతర్రాష్ట్ర సరిహద్దులో పులి సంచరిస్తుండటంతో పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మహారాష్ట్ర పరిధిలోని చంద్రపూర్ జిల్లా అమృత్‌గూడ గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపైకి గురువారం పులి రావడంతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. కొందరు యువకులు ఫోన్‌లో చిత్రీకరించారు. చంద్రపూర్ జిల్లా తడోబా టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ నుంచి పులులు నిత్యం తెలంగాణలోని కాగజ్‌నగర్ డివిజన్‌లోని అటవీ ప్రాంతంలోకి రాకపోకలు సాగిస్తున్నాయని, అటవీ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

మహారాష్ట్ర- తెలంగాణ సరిహద్దు గ్రామం అమృత్‌గూడ సమీపంలో ప్రధాన రహదారిపై పులి

డబ్ల్యూహెచ్‌వో నుంచి వైదొలగనున్న అమెరికా!

అధికారం చేపట్టిన మొదటి రోజే ట్రంప్ నిర్ణయం?

వాషింగ్టన్, డిసెంబర్ 25: అధ్యక్షుడిగా అధికారం చేపట్టిన మొదటి రోజే డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకోబోతున్నారట! ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) నుంచి అమెరికా తప్పుకునేలా కీలక నిర్ణయం వెలువడుతుందని తెలుస్తున్నది. 'నాకు కచ్చితమైన సమాచారముంది. ఆయన అధికారం చేపట్టిన మొదటి రోజు లేదా పాలన ప్రారంభమైన వెంటనే ఈ నిర్ణయం ఉంటుంది' అని జార్జ్‌టౌన్ వర్సిటీకి చెందిన ఆరోగ్య నిపుణుడు లారెన్స్ గోస్టిన్ అన్నట్టు అమెరికా మీడియా కథనాలు చెబుతున్నాయి. డబ్ల్యూహెచ్‌వోపై మొదట్నుంచీ ట్రంప్ తీవ్ర విమర్శలు చేస్తున్నారు. చైనా జేబు సంస్థగా మారిందని, కొవిడ్-19 సంక్షోభానికి చైనాను దోషిగా నిలబెట్టడంలో డబ్ల్యూహెచ్‌వో విఫలమైందని ట్రంప్ ఆరోపించారు. రెండోసారి అధికారం చేపట్టగానే డబ్ల్యూహెచ్‌వో నుంచి 'అమెరికా ఉపసంహరణ' ఖాయమన్న వార్తలు వెలువడ్డాయి. డబ్ల్యూహెచ్‌వో విమర్శకులను అమెరికా ప్రజారోగ్యంలోని కీలక స్థానాల్లో ట్రంప్ భర్తీ చేయటం గమనార్హం. ట్రంప్ నిర్ణయంతో డబ్ల్యూహెచ్‌వో కార్యకలాపాలు ప్రభావితమవుతాయి.

తాడ్వాయి పర్యాటక ప్రాంతంలో మరో అద్భుతం

త్వరలో అందుబాటులోకి బ్లాక్‌బెర్రీ ఐలాండ్

ములుగు, డిసెంబర్ 26 (నమస్తేతెలంగాణ): తెలంగాణలో పర్యాటక రంగానికి పెట్టింది పేరుగా నిలిచిన ములుగు జిల్లాలో మరో అద్భుత పర్యాటక ప్రాంతం రూపుదిద్దుకుంటున్నది. ఇది త్వరలో అందుబాటులోకి రానున్నది. తాడ్వాయి మండలంలోని అటవీ ప్రాంతం మధ్యలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఎకో ఫ్రెండ్లీ టూరిజంలో భాగంగా బ్లాక్ బెర్రీ ఐలాండ్‌లను ఏర్పాటు చేశారు. ఈ ఐలాండ్‌లు పూర్తిగా ఇసుక మేటలపై నిర్మించారు. పర్యాటకులు విడిది చేసేందుకు అధునాతనమైన 50 గుడారాలను సిద్ధం చేశారు. రాత్రి సమయంలో బస చేసే పర్యాటకుల కోసం క్యాంపు ఫైర్ ఏర్పాటు చేశారు. వాగు మధ్యలో ఇసుక మేటలపై 5 ఎకరాల విస్తీర్ణంలో పర్యాటకుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేశారు. బీచ్ వాలీ బాల్ తరహా ఆడేందుకు తగిన ఏర్పాట్లు చేశారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.